## నల్గొండ సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు సునీల్

సారపాక, ఫిబ్రవరి 12: కృష్ణా నదీజలాలపై తెలంగాణ హక్కులను కాపాడుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో మంగళవారం నల్గొండలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన 'నమస్తే'తో మాట్లాడుతూ పినపాక నియోజకవర్గం నుంచి 30 కార్లలో జడ్పీటీసీ, ఎంపీపీలు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, పార్టీ మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో సభకు తరలివెళ్లేందుకు జనసమీకరణ చేసినట్లు తెలిపారు.

భద్రాచలం, ఫిబ్రవరి 12: నల్గొండలో మంగళవారం జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకుడు ఆకోజు సునీల్ అన్నారు. సోమవారం స్థానిక అంబేద్కర్ సెంటర్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కోలా రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణా జలాల పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని కోరారు. సమావేశంలో కోటగిరి ప్రబోధ్‌కుమార్, గుంజ ఏడుకొండలు, బత్తుల నర్సింహులు, లంకపల్లి విశ్వనాథ్, దన్నాన తరుణ్, చెన్నకేశవ, కొల్లిపాక శివ, గుంజ బాబు, ప్రసాద్, రామకృష్ణ పాల్గొన్నారు.

## '17న ముందస్తు లోక్ అదాలత్'

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 12: జిల్లా కోర్టు ఆవరణలో ఈ నెల 17న జరిగే ముందస్తు (ప్రీ)లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి భానుమతి సూచించారు. పోలీస్‌స్టేషన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న రాజీపడదగిన క్రిమినల్, ఈ-పెట్టి, డ్రంక్ అండ్ డ్రైవ్, సివిల్, మనోవర్తి, మోటారు వాహన ప్రమాలు, బ్యాంకు, టెలిఫోన్ తదితర కేసులను పరిష్కరించుకునేందుకు కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కల్పవృక్ష నారసింహుని సన్నిధిలో సౌందర్ రాజన్

భద్రాచలం, ఫిబ్రవరి 12: కల్పవృక్ష నారసింహ సాలగ్రామ మూర్తిని సోమవారం చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధానార్చకులు సౌందర్ రాజన్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్పవృక్ష నారసింహ సాలగ్రామం ఎంతో మహిమాన్వితమైందని, కల్పవృక్ష నారసింహునికి ముడుపులు కట్టడమనేది ప్రాశస్త్యమని తెలిపారు. ఆశ్రమ నిర్వాహకులు డాక్టర్ కృష్ణచైతన్య ఆలయ మర్యాదలతో సత్కరించారు.

## అంగన్‌వాడీని సందర్శించిన భాషా శాస్త్రవేత్తలు

పర్ణశాల, ఫిబ్రవరి 12: మండలంలోని చింతగుప్ప పంచాయతీ తోగ్గూడెం అంగన్‌వాడీ కేంద్రాన్ని సీఐఐఎల్ మైసూర్ సంస్థకు చెందిన శాస్త్రవేత్తలు సోమవారం సందర్శించారు. శాస్త్రవేత్తలు ఎల్ఆర్ ప్రేంకుమార్, దుపుకుంట్ల రమేష్‌భూషణ్ వారితో మాట్లాడారు. కోయభాషలో రచించిన పుస్తకాన్ని పిల్లలకు చూపించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ జానకి, తోగ్గూడెం హెచ్ఎం రవి పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సైన్స్ పోటీలకు 'త్రివేణి' విద్యార్థిని

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 12: నేషనల్ సైన్స్ డే సందర్భంగా తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ పోటీల్లో కొత్తగూడెం త్రివేణి స్కూల్ విద్యార్థిని ప్రతిభ చూపింది. ఈ పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థిని రెహానా వక్తృత్వ పోటీల్లో మూడో బహుమతిని సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. విద్యార్థినిని విద్యాసంస్థల డైరెక్టర్లు గొల్లపూడి వీరేంద్రచౌదరి, గొల్లపూడి జగదీశ్, సీతారామ్ మురళీకృష్ణ, ప్రిన్సిపాళ్లు సురేశ్, శ్రీనివాస్‌సింగ్, సౌజన్య అభినందించారు.

## 24 నుంచి డ్రాయింగ్, టైలరింగ్ పరీక్షలు : డీఈవో

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 12: డ్రాయింగ్ లోయర్, హైయర్, టైలరింగ్ లోయర్, హైయర్ పరీక్షలు ఈ నెల 24 నుంచి 27 జరుగుతాయని డీఈవో వెంకటేశ్వరచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకూ వరకు జరుగుతాయని తెలిపారు. హాల్‌టికెట్ల వివరాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం ఏసీజీ మాధవరావును 9989027943 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

## కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 12: జిల్లా కేంద్రం సమీపంలోని బాబూక్యాంప్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పది తరగతులు చదువుతున్న విద్యార్థులకు హ్యాపీ టూ హెల్ప్ యూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్‌పై సోమవారం అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. టెన్త్ తర్వాత ఏం చేయాలి, ఎక్కడ చదవాలి, ఏది చదివితే మంచి భవిష్యత్ ఉంటుందిఙ అనే అంశాలపై అవగాహన కల్పించారు.

## ఎరువుల దుకాణాలు తనిఖీ

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 12: మండలంలోని ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి నవీన్‌కుమార్ సోమవారం తనిఖీ చేశారు. ములకపాడు, లక్ష్మీనగరం గ్రామాల్లో ఎరువులు షాపులకెళ్లి తనిఖీలు చేపట్టారు. డీలర్లు రిజిస్టర్‌ను పాటించాలని, ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## నలుగురిని కిడ్నాప్ చేసిన మావోయిస్టులు

కొత్తగూడెం క్రైం, ఫిబ్రవరి 12: ఛత్తీస్‌గఢ్‌లో నలుగురిని మావోయిస్టులు కిడ్నాప్ చేసిన ఘటన సోమవారం వెలుగుచూసింది. సుక్మా జిల్లా జగర్‌గూండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని టేకులగూడ జొన్నగూడ ప్రాంతంలో జల్ జీవన్ మిషన్ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం పనులు జరుగుతున్న ప్రాంతానికి సాయుధులుగా వచ్చిన మావోయిస్టులు అక్కడ ఉన్న నలుగురు వ్యక్తులను కిడ్నాప్ చేసినట్లు సమాచారం. కిడ్నాపైన వారిలో మస్తాన్‌పురాకు చెందిన లతీఫ్, నిజాం అనే ఇద్దరు వ్యక్తులు ఉన్నట్లు తెలుస్తోంది. మావోయిస్టులు జల్‌జీవన్ పనులకు వినియోగించే జేసీబీని సైతం తమ వెంట తీసుకెళ్లారు. కిడ్నాపైన వారిలో మరో ఇద్దరి వివరాలు తెలియరాలేదు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

టేకులపల్లి, ఫిబ్రవరి 12: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై గన్‌రెడ్డి రమణారెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని తావుర్య తండాకు చెందిన హమాలీ కూలీ గుగులోత్ గోపి(35), ఆదివారం రాత్రి బైక్‌పై టేకులపల్లి బయల్దేరాడు. మార్గమధ్యలో రాళ్ళ వాగు వద్ద బైక్ అదుపు తప్పి, రోడ్డు పక్కనున్న కాలువలోకి దూసుకెళ్లింది. సోమవారం ఉదయం కాలువ వద్ద గోపిని గ్రామస్తులు గుర్తించారు. అప్పటికే అతడు మృతిచెందాడు. గోపి దంపతులకు పాప, బాబు ఉన్నారు. ఆయన భార్య రోజా ఫిర్యాదుతో కేసును ఎస్సై రమణారెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

## సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

పరిష్కారం కాని అర్జీల స్థితిపై వివరణ ఇవ్వాలి

'ప్రజావాణి'లో అదనపు కలెక్టర్ రాంబాబు



విజ్ఞప్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు రాంబాబు, మధుసూదన్‌రాజు

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 12: ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుల పరిష్కారానికి సంబంధిత అధికారులు చొరవ చూపాలని అదనపు కలెక్టర్ రాంబాబు ఆదేశించారు. ఒకవేళ పరిష్కారం కాని అర్జీలు ఉంటే వారి స్థితిపై వివరణ ఇవ్వాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఐడీవోసీలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో జిల్లాలోని వివిధ ప్రాంతాల వచ్చిన అర్జీదారుల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. వాటిని పరిశీలించి తదుపరి విచారణ, చర్యల కోసం ఆయా వినతులను సంబంధిత శాఖల అధికారులకు రిఫర్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణిలో అర్జీదారులు అందించిన వినతులను పరిశీలించాలని, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఒకవేళ పరిష్కారం కాని సమస్యలుంటే వారి స్థితిని అర్జీదారులకు కూడా తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా వివిధ మండలాల నుంచి వచ్చిన అర్జీదారుల తమ తమ సమస్యలపై అధికారులకు వినతులు సమర్పించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ రాజు, డీఆర్వో రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## జంతువులను వేటాడితే కఠిన చర్యలు

### విద్యుత్ తీగలు అమర్చొద్దు: ఎస్పీ రోహిత్

కొత్తగూడెం క్రైం, ఫిబ్రవరి 12: అడవి జంతువుల వేట కోసం విద్యుత్ తీగలను అమరిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ రోహిత్‌రాజు స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఎవరైనా అడవి జంతువులను వేటాడినట్లు సమాచారం వస్తే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. అడవి జంతువులను వేటాడేందుకు కరెంటు తీగలను ఏర్పాటు చేయడం వల్ల పొలాలకు పనులకు వెళ్లే రైతులు, పశుగ్రాసం కోసం వెళ్లే జంతువులు విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోతున్నట్లు చెప్పారు. జంతువుల వేట కోసం కరెంటు తీగలు ఏర్పాటు చేసేవారిపై నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. భూపాలపల్లి జిల్లాలో కూంబింగ్‌కు వెళ్లిన కానిస్టేబుల్ కూడా వేటగాళ్లు అడవిలో అమర్చిన కరెంటు తీగలకు తగిలి ప్రాణాలు కోల్పోవడం దిగ్భ్రాంతికరమని అన్నారు. విద్యుత్ తీగలు అమర్చే వేటగాళ్ల వివరాలను పౌరులు కూడా తమకు తెలియజేయవచ్చునని అన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న డీఎస్పీ రెహమాన్

అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 12: అటవీ జంతువుల వేటాడేందుకు ఎవరైనా విద్యుత్ తీగలను అమర్చితే కఠిన చర్యలు తప్పవని కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ తీగల కారణంగా పొలాలకు వెళ్లే రైతులు, జంతువుల విద్యుదాఘాతంతో ప్రాణాలు పోతున్నాయన్నారు. తహసీల్దార్ జగదీశ్వర్‌ప్రసాద్, విద్యుత్‌శాఖ ఏఈ సాయి తరుణ్, ఎస్సై షాహీనా పాల్గొన్నారు.

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 12: అడవి జంతువులను వేటాడేందుకు విద్యుత్ తీగలను అమర్చినట్లు తమ దృష్టికి వస్తే ఎంతటి వారినైనా సహించేదిలేదని సీఐ రమాకాంత్ హెచ్చరించారు. సోమవారం పోలీసు స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. కరెంటు తీగలను ఏర్పాటు చేసినట్లు తెలిస్తే 8712682089కు సమాచారం అందించాలన్నారు.

పినపాక, ఫిబ్రవరి 12: అడవి జంతువులను వేటాడేందుకు కరెంటు తీగలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని ఏడూళ్లబయ్యారం సీఐ శివప్రసాద్ హెచ్చరించారు.

దమ్మపేట, ఫిబ్రవరి 12: వన్యప్రాణులను వేటాడేందుకు విద్యుత్ తీగలు అమరిస్తే చర్యలు తీసుకుంటామని దమ్మపేట ఎస్సై సాయికిశోర్‌రెడ్డి హెచ్చరించారు.

అశ్వారావుపేట, ఫిబ్రవరి 12: అటవీ జంతువుల వేట కోసం ఎవరైనా విద్యుత్ తీగలను అమర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ కరుణాకర్ హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఆయన మాట్లాడారు.

## సైన్స్‌తోనే సమస్యలకు పరిష్కారం

జిల్లాస్థాయి సైన్స్ పోటీల బహుమతుల ప్రదానంలో డీఈవో

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి 12 మంది ఎంపిక



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఈవో

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 12: సమస్యలకు పరిష్కారం చూపేది సైన్సేనని డీఈవో వెంకటేశ్వరచారి పేర్కొన్నారు. పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కల్పించినప్పుడే పర్యావరణానికి పరిరక్షణ మరింత మెరుగవుతుందని అన్నారు. కొత్తగూడెంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో జిల్లా సైన్స్ ఆఫీసర్ చలపతిరాజు ఆధ్వర్యంలో సోమవారం జరిగిన జిల్లాస్థాయి సైన్స్ పోటీల బహుమతి ప్రదానోత్సవంలో డీఈవో మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే పర్యావరణంపై పిల్లలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆసక్తిని, పరిశీలనాశక్తిని పెంపొందించాలని సూచించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన 12 మంది విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈ నెల 28న జరిగే సైన్స్ డే సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో బహుమతి ప్రదానోత్సవం ఉంటుందన్నారు. జిల్లాలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఎన్‌సీఎస్‌సీ కో ఆర్డినేటర్ సంపత్‌కుమార్, హెచ్ఎంలు ప్రభాకర్‌రావు, వెంకటేశ్వర్లు, మధు, కల్యాణి, అనురాధ పాల్గొన్నారు.

## కూల్ కేక్ తిన్న చిన్నారులకు అస్వస్థత

దుకాణాన్ని పరిశీలించి రూ.7 వేల జరిమానా విధించిన అధికారులు



కేక్‌లను తనిఖీ చేసి జరిమానా విధిస్తున్న శానిటేషన్ అధికారి లక్ష్మణ్‌రావు

పాల్వంచ, ఫిబ్రవరి 12: పాల్వంచ బస్టాండ్ కాంప్లెక్స్‌లోని ఐస్ మ్యాజిక్ దుకాణం నుంచి కొనుగోలు చేసిన కూల్ కేక్‌ను చిన్నారులకు వాంతులు, విరేచనాలు అయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. పాల్వంచ పెద్దమ్మగుడిలో పనిచేసే మేకా నరసింహారావు తన కుమార్తె పుట్టిన రోజు కోసం పాల్వంచ బస్టాండ్ కాంప్లెక్స్‌లోని ఐస్ మ్యాజిక్‌లో ఆదివారం రాత్రి కూల్ కేక్‌ను కొనుగోలు చేశాడు. ఇంటికి వెళ్లాక ఆ కేక్‌ను కట్ చేసి ముగ్గురు చిన్నారులు తిన్నారు. ఆ వెంటనే వారికి వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. వెంట నే కుటుంబ సభ్యులు ఆ చిన్నారులను స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. దీంతో బాధితుడు నరసింహారావు పాల్వంచ మున్సిపల్ కమిషనర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శానిటేషన్ అధికారి లక్ష్మణరావు ఐస్ మ్యాజిక్ దుకాణాన్ని పరిశీలించి బూజుపట్టిన కూల్ కేకులను గుర్తించారు. దీంతో షాపు యజమానికి రూ.7 వేల జరిమానా విధించారు. మరోసారి ఇలాంటి పొరపాటు జరిగితే షాపును సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.

## 18 నుంచి మేడారానికి ప్రత్యేక బస్సులు

వనదేవతల జాతరకు కొత్తగూడెం డిపో నుంచి 180 సర్వీసులు

ఈ బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణం: ఆర్టీసీ డీఎం

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 12: మేడారం జాతరకు వెళ్లే భక్తుల కోసం తమ సంస్థ ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ కొత్తగూడెం డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. ఈ నెల 18 నుంచి కొత్తగూడెం బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సులు ప్రారంభమవుతాయని అన్నారు. భక్తులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం రెండు బస్సులను నడుపుతున్నామని, ఈ బస్సులు ఉదయం 6 గంటలకు, 9 గంటలకు కొత్తగూడెం బస్టాండ్ నుంచి బయలుదేరుతున్నాయని వివరించారు. ఈ ప్రత్యేక బస్సుల్లో కూడా మహిళలు ఆధార్‌కార్డు చూపించి ఉచిత ప్రయాణం చేయవచ్చునని అన్నారు. ఈ జాతర కోసం మొత్తం 180 బస్సులను నడిపేందుకు కార్యాచరణ సిద్ధం చేసినట్లు చెప్పారు. భక్తులు ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకునేందుకు కొత్తగూడెం బస్టాండ్ వద్ద, మేడారం జాతర వద్ద తగిన సిబ్బందిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

## డీసీపీ వినిత్‌ను కలిసిన భవానీ ప్రసాద్

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 12: గతంలో కొత్తగూడెం ఎస్పీగా పని చేసి ప్రస్తుతం హైదరాబాద్ మాదాపూర్‌లో డీసీపీగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ వినిత్‌ను కొత్తగూడెం వ్యాపారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మొరిశెట్టి భవానీప్రసాద్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. గతంలో ఆయన కొత్తగూడెంలో పనిచేస్తున్న సమయంలో వ్యాపారుల సంక్షేమం కోసం సహకారాలు అందించారని గుర్తుచేశారు. తమతో కలిసి దిగిన చిత్రాన్ని ఎస్పీకి బహూకరించారు.

## టీజీవోస్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో గెజిటెట్ ప్రతినిధులు

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 12: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవోస్) జిల్లా కార్యవర్గ సమావేశాన్ని కొత్తగూడెం జడ్పీ పరిషత్ కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటపుల్లయ్య ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 2024 సంవత్సర సభ్యత్వ నమోదులో చర్చించారు. అనంతరం కార్యవర్గ సభ్యులతో సభ్యత్వ నమోదు చేయించారు. సంఘం బాధ్యులు డాక్టర్ విజయ్‌కుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఉమ్మడి ఖమ్మం జిల్లాలో డీఎస్పీల బదిలీ

కొత్తగూడెం క్రైం, ఫిబ్రవరి 12: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏడుగురు డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ కార్యాలయం నుంచి సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్‌ను వరంగల్ జిల్లా మామునూరు ఏసీపీగా, ఇల్లెందు డీఎస్పీ ఎస్.వీ. రమణమూర్తిని కొత్తగూడెం డీఎస్పీగా, హైదరాబాద్ సీసీఎస్, డీడీ ఏసీపీ లింగనబోయిన ఆదినారాయణను పాల్వంచకు, పాల్వంచ డీఎస్పీ ఎన్. వెంకటేశ్‌ను డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఖమ్మం జిల్లాలో ఖమ్మం ట్రాఫిక్ ఏసీపీ ఎస్.సారంగపాణిని హైదరాబాద్ ఎస్‌బీ ఏసీపీగా, సత్తుపల్లి డీఎస్పీ బి. రామానుజంను డీజీపీ కార్యాలయానికి అటాచ్, హైదరాబాద్ టీఎస్ సైబర్ సెక్యూరిటీస్ బ్యూరో ఏసీపీ ఎ.రఘుని సత్తుపల్లి డీఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

### ఖమ్మం అడిషనల్ డీసీపీ ప్రసాదరావు బదిలీ..

ఖమ్మం లా అండ్ ఆర్డర్ అదనపు డీసీపీ కేఆర్‌కే ప్రసాదరావును టీఎస్‌పీఏ అదనపు ఎస్పీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో టీఎస్‌పీఏ అడిషనల్ ఎస్పీ ( అసిస్టెంట్ డైరెక్టర్) రవీందర్‌రెడ్డిని ఖమ్మం అడిషనల్ డీసీపీ (అడ్మిన్)గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## 24న టెన్త్ టాలెంట్ టెస్ట్: ఎస్ఎఫ్ఐ

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 12: ఈ నెల 24న టెన్త్ విద్యార్థులకు తమ సంఘం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ట్యాలెంట్ టెస్టును నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరభద్రం సోమవారం తెలిపారు. ఈ నెల 19, 20 తేదీల్లో మండల స్థాయిలో టెస్టులు నిర్వహిస్తామన్నారు. 9492930835, 9014304293 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

## బట్టు రాజేశ్వరరావుకు నివాళి

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 12: ఇటీవల రైలు ప్రమాదంలో మృతిచెందిన త్రీ ఇంక్లైన్ ప్రాంతానికి చెందిన బట్టు రాజేశ్వరరావుకు కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి నివాళులర్పించారు. ఇటీవల మృతిచెందిన రాజేశ్వరరావు దశదిన కార్యక్రమాన్ని పట్టణంలో సోమవారం నిర్వహించారు. చైర్‌పర్సన్ హాజరై.. రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

## సంక్షిప్తం

### కొనసాగుతున్న పారిశుధ్య కార్యక్రమాలు

జూలూరుపాడు, ఫిబ్రవరి 12: ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా మండలంలోని 24 గ్రామ పం చాయతీల్లోనూ పారిశుధ్య పనులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం అన్ని గ్రామాల్లోనూ మురుగుకాల్వల్లోని మురుగు తొలగింపు పనులను చేపట్టారు. అలాగే వీధులన్నింటినీ శుభ్రం చేశారు. కార్యక్రమాలను ఎంపీవో తోట తులసీరాం పర్యవేక్షించారు.

### పాఠశాలకు 50 కుర్చీల వితరణ

జూలూరుపాడు, ఫిబ్రవరి 12: మండలంలోని కాకర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి, చిన్న జీయర్‌స్వామి శిష్యుడు సౌమిత్రి శ్రీధరాచార్యులు తన కుమారుడు శ్రీకమల్ జ్ఞాపకార్థం తాను చదువుకున్న పాఠశాలకు రూ.30 వేల విలువైన 50 ప్లాస్టిక్ కుర్చీలను వితరణ చేశారు. వీటిని తన తరఫున గ్రామస్తుల ద్వారా పంపారు. వారు ఈ కుర్చీలను సోమవారం పాఠశాల ఉపాధ్యాయులు హెచ్ఎం సంజీవరావుకు అందజేశారు.

### అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ నిర్మాణానికి స్థల పరిశీలన

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 12: మణుగూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను నిర్మించేందుకు టాటా కంపెనీ ప్రతినిధులు సోమవారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా టాటా కంపెనీ ప్రతినిధి బీ సీతారాములు సెంటర్‌కు కావాల్సిన వసతులపై అధికారులతో చర్చించారు. ఏజెన్సీ ప్రాంతంలోని విద్యార్థులు ఇటువంటి అవకాశాలను చేసుకునేందుకు కృషిచేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ బీ ప్రభాకర్, ట్రైనింగ్ అధికారి జీ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

### చిరంజీవిని కలిసిన ఖాసీం

పాల్వంచ, ఫిబ్రవరి 12: సినీనటుడు చిరంజీవిని న్యూ పాల్వంచ మెగా ఫ్యాన్స్ అధ్యక్షుడు ఖాసీం సోమవారం మర్యాదపూర్వకంగా ఆయనను కలిశారు. హైదరాబాద్‌లోని చిరంజీవి బ్లడ్‌బ్యాంక్‌లో మెగాస్టార్‌ను కలిసిన ఖాసీం.. కేంద్ర ప్రభుత్వం నుంచి ఇటీవల పద్మవిభూషణ్ అవార్డు పొందినందుకు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చిరంజీవికి ఖాసీం దేవుడి పటాలతో కూడిన జ్ఞాపికను అందజేశారు.

### రూ.500కే గ్యాస్ కోసం ఇంటింటి సర్వే

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 12: మహాలక్ష్మి పథకం కింద రూ.500కే గ్యాస్ సిలిండర్ కోసం పట్టణంలో చేపట్టిన ఇంటింటి సర్వే కొనసాగుతోంది. పట్టణంలో గ్యాస్ సిలిండర్లు వినియోగిస్తున్న కుటుంబాలు 5,916 అని అధికారులు లెక్కతేల్చారు. ఇప్పటి వరకు 5,562 దరఖాస్తుల సర్వే పూర్తి చేశారు. మంగళవారం నాటికి సర్వే ప్రక్రియను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

## రామయ్యకు ముత్తంగి అలంకరణ

భద్రాచలం, ఫిబ్రవరి 12: భద్రాచలం సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో సోమవారం అంతరాలయంలోని మూలవరులకు బెంగుళూరు భక్తులు రూ. 30లక్షలతో తయారు చేయించి సమర్పించిన ముత్యాలు పొదిగిన ప్రత్యేక తొడుగులను అర్చకులు ధరింపజేశారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామి వారికి సుప్రభాతం పలికి, నిత్యపూజలు జరిపారు. అనంతరం స్వామి నిత్య కల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి నిత్య కల్యాణం జరిపారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు స్వామి వారి ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

## హోమశాలకు రూ.40,226 విరాళం

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 12: మామిళ్లవారిగూడెం మల్లేశ్వరస్వామి ఆలయ ఆవరణలోని హోమశాల ఏర్పాటుకు సోమవారం మండలానికి చెందిన జుజ్జూరి ప్రసాద్, నులకాని శ్రీనివాసరావు, జయవరపు రాంబాబు రూ.40,226 భక్తులు విరాళంగా ఇచ్చారు.

## విద్యార్థుల చదువును గమనిస్తుండాలి

భద్రాచలం, ఫిబ్రవరి 12: ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల చదువును గమనిస్తుండాలని ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున సంబంధిత స్పెషల్ ఆఫీసర్లు పాఠశాలలను సందర్శించి విద్యార్థులు ఏ సబ్జెక్టులో వెనక పడ్డారో గమనించి, వారికి స్పెషల్ తరగతులు నిర్వహించాలని తెలిపారు.

## గీత హర్షిణికి ఐటీడీఏ పీవో అభినందన

దమ్మపేట/భద్రాచలం, ఫిబ్రవరి 12: అంకంపాలెం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న గీతా హర్షిణి ఇటీవల హనుమకొండలో నిర్వహించిన రాష్ట్ర అండర్-15 కుస్తీ పోటీల్లో సత్తా చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. క్రీడాకారిణిని సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, డీడీ మణెమ్మ, ఏపీవో డేవిడ్‌రాజు అభినందించారు.

## ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా సాగర్

భద్రాచలం, ఫిబ్రవరి 12: భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాల కార్యాలయ సూపరింటెండెంట్‌గా ఖమ్మం సర్వజన ఆసుపత్రిలో తాత్కాలిక సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సాగర్‌ను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

## 'గృహజ్యోతి' గుర్తింపునకు క్షేత్ర పరిశీలన



వివరాలు నమోదు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

పాల్వంచ, ఫిబ్రవరి 12: గృహజ్యోతి పథకం లబ్ధిదారులను గుర్తించేందుకు పాల్వంచ పట్టణంలో విద్యుత్ శాఖ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నారు. ఈ పథకంలో గృహ అవసరాల కోసం 200 యూనిట్ల లోపు విద్యుత్‌ను వినియోగించే వారికి ఉచిత విద్యుత్ అందించేందుకు లబ్ధిదారుల వివరాలను సేకరిస్తున్నారు. పట్టణంలోని ఇందిరాకాలనీ, హమాలీకాలనీ, వనమాకాలనీ సహా ఇతర వార్డుల్లో విద్యుత్‌శాఖ ఉద్యోగులు సోమవారం ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించారు. ప్రజాపాలనలో దరఖాస్తు వివరాలతో దరఖాస్తుదారుల రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, కరెంటు బిల్లుల వివరాలను పోల్చిచూస్తున్నారు. ఆ వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

## దేవస్థానం ఈవో బదిలీని నిలిపివేయాలి

భద్రాచలం, ఫిబ్రవరి 12: భద్రాచలం సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఈవో ఎల్ రమాదేవి బదిలీని నిలిపివేయాలని బీఆర్ఎస్ నాయకుడు ఆకోజు సునీల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఆమె దేవస్థానం ఈవోగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి దేవస్థానం అభివృద్ధికి విశేషంగా కృషి చేశారన్నారు. ఈవో బదిలీని నిలిపివేయాలన్నారు.

## ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడిగా అర్వపల్లి

ఇల్లెందు, ఫిబ్రవరి 12: ఆర్య వైశ్య సంఘ పట్టణ అధ్యక్షుడిగా అర్వపల్లి రాధాకృష్ణను స్థానిక ఐతా ఫంక్షన్ హాల్‌లో జరిగిన సోమవారం జరిగిన సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఆయనను నాయకులు గౌరిశెట్టి కృష్ణ తదితరులు అభినందించారు.

## స్కావెంజర్ పోస్టులకు దరఖాస్తులు

ములకలపల్లి, ఫిబ్రవరి12: ములకలపల్లి కేజీబీవీ పరిధిలో ఖాళీగా ఉన్న రెండు స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సోమవారం ఎంఈవో కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది. 18-45 ఏళ్లలోపు మహిళా అభ్యర్థులు పోస్టులకు అర్హులన్నారు. వారు ఈనెల 15లోపు అర్హతకు సంబంధించిన ధ్రువపత్రాలపై గెజిటెడ్ ఆఫీసర్ సంతకం చేయించి ఎంఈవో కార్యాలయంలో అందజేయాలన్నారు.

## శివాలయానికి రూ.లక్ష వితరణ

బూర్గంపహాడ్, ఫిబ్రవరి 12: స్థానిక గంగా పార్వతి సమేత శివాలయానికి మండలంలోని అంజనాపురం గ్రామానికి చెందిన భూక్యా బాల్య, జామిరి దంపతుల కుమారుడు మోహనరావు, పద్మ దంపతులు రూ.1,00016లు ఆలయ కమిటీ బాధ్యులకు సోమవారం అందజేశారు. మహాశివరాత్రి సందర్భంగా లయంలో నిర్వహించే శ్రీలక్ష్మిగణపతి హోమం, స్వామివారి కల్యాణమహోత్సవాల కోసం ఈ నగదు అందజేశామని దాతలు పేర్కొన్నారు.

## లారీ టైర్లు దగ్ధం

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 12: రోడ్డుపై వెళ్తున్న లారీ టైర్లు దగ్ధమయ్యాయి. సోమవారం మణుగూరు నుంచి కోదాడ వైపు లారీ వెళ్తున్నది. ఖమ్మం రోడ్డులోని గౌతమ్‌బుద్ధ ఐటీఐ కళాశాల వద్ద, లారీ టైర్ల నుంచి మంటలు రావడాన్ని ద్విచక్ర వాహన చోదకులు గమనించి, డ్రైవర్‌ను అప్రమత్తం చేశారు. డ్రైవర్ వెంటనే రోడ్డు పక్కకు లారీనినిలిపాడు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే లారీ టైర్లు పూర్తిగా కాలిపోయాయి.

## తైక్వాండో మాస్టర్ మొగిలికి ఉత్తమ అవార్డు

రామవరం, ఫిబ్రవరి 12: సీనియర్ కరాటే మాస్టర్, తైక్వాండో అసోసియేసన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న ఇనిగాల మొగిలికి ఉత్తమ తైక్వాండో మాస్టర్ 2024 అవార్డు లభించింది. ఆయన ఈ ఏడాది బెస్ట్ మాస్టర్‌గా ఎంపికయ్యారు. నర్సంపేటలో ఆదివారం జరిగిన జాతీయస్థాయి మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ముఖ్య అతిథిగా విచ్చేసిన నటుడు, మార్షల్ ఆర్ట్స్ లెజెండ్ సుమన్ మొగిలికి అవార్డును ప్రదానం చేశారు.

## టీఆర్‌వీకేఎస్ వైటీపీఎస్ నూతన కమిటీ ఎన్నిక

పాల్వంచ, ఫిబ్రవరి 12: టీఆర్ఎస్ అనుబంధ రాష్ట్ర విద్యుత్ కార్మికుల సంఘ (టీఆర్‌వీకేఎస్) వైటీపీసీ నూతన కమిటీని సంఘ బాధ్యులు సోమవారం ఎన్నుకున్నారు. పాల్వంచ కేటీపీఎస్ ప్రాంతీయ కార్యాలయంలో రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్, జెన్కో కార్యదర్శి చారుగుండ్ల రమేశ్ అధ్యక్షతన ఈ ఎన్నిక జరిగింది. వైటీపీఎస్ రీజినల్ అధ్యక్ష కార్యదర్శులుగా మల్లెల వీరనారాయణ, నాదెళ్ల రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైటీపీఎస్‌లో ఫోర్మెన్లుగా పనిచేస్తున్న కే.అంజంరాజు జెన్కో ఉపాధ్యక్షుడిగా, ఎం.ప్రేమ్ కుమార్‌ను జెన్కో అసిస్టెంట్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. టీఆర్‌వీకేఎస్, జెన్కో నాయకులు నూతన కమిటీని సన్మానించారు.